# పిచ్చుక గూళ్లు

అవును.

ఆ నాలుగురోడ్ల సెంటరులో కాన్‌టీన్‌కు ఎదురుగా, లైటుస్థంభం ప్రక్కన నీలం సూటులో నిలబడ్డాడే అతనే ఆనందరావు.

.... .... ....

మిస్టర్ ఆనందరావు, యం.ఎ. కాసేపు ఆత్మతో ఘర్షణపడి వాచీ చూసుకున్నాడు. స్టేషన్‌లో రైల్వే టైం ప్రకారం ఎనిమిదిన్నర అయివుంటుంది.

ఇంకా గంటన్నర వుంది జి. టి. బయల్దేర డానికి.

ఆనందరావు నూట పదకొండోసారి ఓ కాగితాన్ని జేబులోంచి తీసి చూసుకున్నాడు.

'నేను నవంబరు 15న వెడుతున్నాను. నన్ను కలవడానికైనా రావచ్చునుగా'

—మంజులత.

ఇంకో ఐదు నిముషాల్లో తనక్కడ వుంటాడు. ఎంత మారిపోయి వుంటుందో. రెండేళ్ళేగా అయింది. పెద్ద మార్పేమీ వుండక పోవచ్చు. ఏమో. ఏమిటి ఆమెలో ఆకర్షణ తనకి ?....

'రిక్షా కావాలాసార్ ?'

—'కు పోవాలి, ఏం తీసుకుంటావ్ ?'

'ఛె ఆనా యివ్వండి'

'ఇవ్వను'

రిక్షా వెళ్లిపోయింది.

ఓరినీ, వెళ్ళిపోతున్నాడే....పిలవనా అను కున్నాడు ఆనందరావు. కాని, అతని ఆత్మాభిమానం రోడ్డుమీద అడ్డంగా నిలుచుంది. ఆత్మాభిమానం అతన్నావిధంగా గదమాయించ డానికి కారణం లేకపోలేదు. ఇదివరకు అక్కడికి మూడణాలకే ఎన్నోసార్లు వెళ్లాడు ఆనందరావు. పైగా ఆనందరావుకి దరిద్రం విలువ బాగా తెలుసు. తన చిన్నప్పుడు అమ్మ ఇంట్లో లైటు వెలిగించడానికి కిరసనాయిల్ లేక వెన్నెట్లో అన్నం పెట్టేంది. అందుకే దరిద్రం అంటే అతనికి అంతభయం. వెధవది ఇంత నగరంలోను యిక్కడే రెగ్యులర్ బస్ రూట్ లేదు. ఆనందరావు విసుక్కున్నాడు. నడుద్దామంటే వున్న కాస్త టైము అదే తినేస్తుంది.

'రిక్షా....

....కు ఏం తీసుకుంటావ్ ?'

ఆరానా యివ్వండి

అక్కర్లేదు....

రిక్షా సణుక్కుంటూ వెళ్లింది. ఇదేవిధంగా రెండుమూడు రిక్షాలు ఆనందరావుని ఇంటర్వ్యూ చేశాయి. అవన్నీ ఓకేబడిలో చదువుకున్నాయి.

నిజానికి, ఆనందరావు జీవితం గురించి ఆలోచించడం మానుకున్నదగ్గరనుండి ఇటు వంటి చిన్న విషయాలకి బాధపడడం మానేశాడు.

సిగరెట్టు వెలిగించాడు.

పెరుగుతున్న రాత్రిని చుట్టుకుంటూ వీధి దీపం వెలుగులోంచి చీకటిలోకి ప్రయాణిస్తు న్నాయి సిగరెట్టు పొగ వలయాలు.

యం. హెచ్. కేశవరావ్

ఆనందరావుకి యీ ఊరు, యీ రోడ్లు, యీ రిక్షాలు కొత్తకాదు. యం.ఎ. వరకు అత నిక్కడే చదువుకున్నాడు. ఈ నాలుగు రోడ్లు అతని డైరీ పుటల్లోని ఎన్నో సంఘటనల్ని చూశాయి.

ఈ నాలుగురోడ్ల కూడలిలోనే ఓ రాత్రి ఆమె తనతో అంతవరకూ నడిచివొచ్చి రిక్షా ఎక్కి వెనక్కి చిలిపిగా చూస్తూ, నవ్వుతూ వెళ్లిపోయింది. ఆరోజుల్లో అతను టీ కాలేజీ అనే గదిలో జీవితం బొమ్మ రంగుల్తో వేసు కుంటున్నాడు. చిన్నచిన్న విషయాలగురించి తీవ్రంగా యోచించేవాడు.

ఆ రాత్రి, ఆ వెన్నెల!

ఏమీ మిగలనట్టే ఆ రాత్రి కదిలిపోయింది చుక్కలలోకి.

రిక్షా ఎక్కి, గాలికి రేగిన ముంగురుల్ని సవరించుకుంటున్నప్పుడు ఆమె గాజులు తన హృదయంలో చేసిన చప్పుడు....

ఆమె తన్ను ప్రేమిస్తోందా?

ఆ భావం రాగానే అతనికి భయం వేసింది.

ఆమె ప్రేమించడమా? ఎందుకో ఆ భావాన్ని ఆమెతో ఊహించుకోలే డతను. మరి?

ఎప్పుడూ కదలికని వొదలని కళ్లు. గట్టిగా చూస్తే శిలలు చలించే చూపులు. విరహాన్ని రేకెత్తించే పెదాలమధ్య నెలవంక చిరునవ్వు. కొండలమధ్య ప్రవహించే సెలయేటి నడుం.... నదులు సముద్రంలో అంతమవడం గుర్తు కొస్తుంది. బొడ్డుమల్లెల్లో ప్రవహించే వెన్నెల ఆమె. ఆమె యీ యుగానిది కాదు. చరిత్ర కందక వుండిపోయింది.

ఆమె తనను ప్రేమిస్తుందా?

అసలామె ఎవర్నయినా ప్రేమించగలదా? ఎవరెస్టు శిఖరం, చంద్రమండలం, అరే బియా సముద్రం, గోబీ ఎడారులు తమవంటే తమవని ప్రభుత్వాలు పోట్లాడుకుంటూంటే ఆ అజ్ఞానానికి అవి నవ్వుకున్నట్లు—కాలేజీలో ఆమెని "ఆనందలత" అని అరిచినప్పుడు కూడా అలాగే నవ్వేసింది.

ఆమె స్నేహంకోసం ఉబలాట పడిన వాళ్లలో అతనొకడు. కాని ఆమే ముందు కొచ్చేవరకు అతను తన ఉనికిని మరచి పోలేకపోయినాడు.

అదంతా అతనికి యీనాటికీ ఓ కలే.

ఓ సాయంత్రం అతను సన్నగా పాడు కుంటూ డ్రెస్ చేసుకుంటున్నాడు రూంలో. అన్నీ మంచి పిక్చర్సే. దేనికి వెళ్ళాలా అనే సంధ్యా సమస్యలో మునిగి వున్నాడు.

ఇంతలో బయటినుండి "ఆనందరావు గారూ" అనే సన్నని పిలుపు.

"కమ్ఇన్"

తెరతొలగించుకుని వెన్నెలలోపల పడింది.

ఆనందరావులో అంతవరకూ వున్న ఆనందం హరించుకుపోయింది; ఆమెను చూసే ప్పటికి.

మంజులత.

అతను కూర్చోండి అని తడబడుతూండ గానే ఆమె రాక్ వద్దకు వెళ్లి పుస్తకాలు పరి శీలిస్తో -"నా రాక మీకేమైనా అభ్యంతరమా?" అంది అమాయికంగా అంటున్నట్లు.

"కాదు....లేదు...అనుకోండి..."

ఎందుకు కాదు—ఇప్పుడు ఇంటావిడ చూసిందంటే వెంటనే గది ఖాళీ చేయమం టుంది. ఎదిరింటి ఎనిమిదేళ్ళ లలితవచ్చి రెండు గులాబీలు కోసుకోడం చూసి, వద్దని ఆనందరావు చెప్పలేదని ఓ నెలరోజులు ఇంటా

విడ అతన్ని ఎదిరింటివైపు చూడనివ్వలేదు. ఇంతేగాదు, అతనికింకా చాలా అభ్యంతరా లున్నాయి.

అతను తల దువ్వుకుంటున్నట్లు నటిస్తూ నిశ్శబ్దాన్ని పోషిస్తున్నాడు. అట్లా కొన్ని భయంకరమైన క్షణాలమీదుగా ఆనందరావు నడుస్తూ పోయినాడు. కాని అతనికి అవతలి గట్టుమాత్రం కనిపించలేదు. చివరకు గొంతు పెగుల్చుకుని, నే నిప్పుడే వస్తా ఫ్లాస్కు పట్టుకుని అన్నాడు — 'మీరు పుస్తకాలు చూస్తూ వుండండి, నే నిప్పుడే వస్తాను' అని.

ఆమె నవ్వుతూ, 'ఒమర్ ఖయ్యాం' నుండి తలెత్తి 'మీకు ఆతిథ్యంకూడా తెలుసునే' అంటూ — 'మీ పుస్తకాలకీ, మర్యాదలకీ కాదు లెండి నేవొచ్చింది, మీరో పాట పాడాలి ఇప్పుడు, ఆ తర్వాత అతిథిసత్కారం'.

ఒక క్షణంసేపు ఆనందరావుకు ఎదురుగా గోడమీద కాలెండర్‌లోని సినిమాతార తల క్రిందైై కనిపించింది.


"నాకు పాటలు రావండి"

"మీరు అబద్ధాలుకూడా ఆడడానికి ప్రయత్నిస్తారన్నమాట; నేను మొన్న కాలేజీలో మ్యూజికల్ యీవినింగ్‌కు వొచ్చాలెండి"

ఆ తరువాత ఓ పావుగంటసేపు అతను పాడలేనని, రావని, ఇప్పుడుకాదని, ఆమె యిప్పుడు తప్పదని అనుకోవడం, చివరకు బయటికెక్కడికయినా వెడదామనే ఒప్పం దానికొచ్చారు.

గార్డెన్ కాంటీన్‌లో కాఫీ అయినతర్వాత బస్సుమీద హుసేన్‌సాగర్ అవతలి గట్టుకు చేరుకున్నారు.

సంధ్య ఇంద్రజాలంలో మునిగినరాళ్ళు, నీళ్ళు, ఆకాశంకింద పసిపిల్లలయారు వాళ్లు.



"నిజంగా మీ డాక్టరుకి మూడువందల యేళ్ళు ఉన్నాయా? ఏదోమందుచేసుకుని తాగారట కాదూ."

"సరిగ్గా చెప్పలేను, ఆయనసంగతి. నేను ఆయన దగ్గర నూట యాభై యేళ్లనుంచే పని చేస్తున్నాను".

అతని పాటతోబాటు ఆ రాత్రి మీదికి వెన్నెలపాకింది.

ఆమె అతనిపక్కనే ఓ రాయి నానుకుని కూర్చుంది.

అతనికి ఆశ్చర్యం ఆ రాత్రి, తను నిజంగా గొప్పగా పాడగలనా? అని. కాని, పాడాడు. తన గొంతులో ఏదో అన్వేషణ, రక్తాన్ని ఉద్రేకపరచి, మళ్ళీ జోకొట్టేతనం. దాహాన్ని తీర్చుకుంటూ అన్వేషణలో పెరిగే శరీరం, ఇంద్రియాల చాపల్యంతో మెలికలు తిరిగిన అనుభవాలు, గతం కరిగి వర్తమానంలోకి ప్రవహించి, భవిష్యత్తులో గడ్డకట్టుకుంటున్న

కాలం; నువ్వూ, నేనూ రెండూ కలిసిపోయి "మనం" అయిపోయిన క్షణాలు.

రాత్రి పెరుగుతోంది వెన్నెల మేసి.

హుసేన్‌సాగర్ కెరటాలుకదులుతున్నాయి వాళ్ళనిచూసి.

మూసివున్న ఆమె కళ్ళు నక్షత్రాలను చూస్తున్నయ్.

గొప్ప అనుభవం ఆ క్షణంలో తాము బ్రతికివున్నట్లు, బ్రతుకులో యిటువంటిక్షణాలు కూడా వుంటాయని తెలుసుకోడం వాళ్లిద్దరికీ.

రాత్రి మంచు కురుస్తోంది.

ఆకాశం వెన్నెల వర్షిస్తోంది.

యుగాలు క్షణాలుగామారి, చరిత్రలో విరహం వాళ్ళిద్దర్నీ కాలంతో బంధించింది.

అతను మత్తుగా ఆమెవంక తిరిగాడు. ఆమెకళ్ళు ఇంకోలోకంలో మూర్ఛపోయినై. శరీరం వయస్సుతో పెనుగులాడి హద్దుల్ని తెంపుకుంటోంది. అది తమాషా అయిన వాతావరణం. అతనికి అందులో రక్తం ఇమడక ఎదురుతిరుగుతోంది. ఆమె, తను, వెన్నెల ....ఏదీ విడికాదు. అంతాఒకటే — చప్పున ఆమెను కౌగిలించుకుని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

ఆమె కళ్లు తెరవలేదు. చేతులు అతని శరీరాన్ని వెతుకుతున్నయ్. అతనికి తను యిదివరకు వేసుకున్న ప్రశ్నలకు జవాబులు దొరుకుతున్నయ్.

ఏమిటీ జీవితానికర్థం ?

ఆ బాట చివర ఏముంది ?

సత్యానికై పురిటిగదిలోంచి శ్మశాన వాటిక వరకు మానవుడి వెతుకులాట; ఆనందం కొరకు విషాదాన్ని చీల్చుకుంటూ పోవడం, దారిలో అనుభవాల, అనుభూతుల ముళ్లవలన కలిగే గాయాలు, ఆ గాయాలకు మళ్ళీ సత్యం ఐడిన్.

ఎల్లోరాలో స్త్రీమూర్తికి ప్రాణం వొచ్చి అతన్ని కౌగిలించుకుంది. ఆ సౌందర్య శిఖరాలకు అతను తీసుకుపోబడుతున్నాడు. ఆమె చేతులు అతన్ని బంధించినై. అతని నిట్టూర్పుల్ని ఆమె వక్షం అదుకుంటోంది.

ఆ రాత్రి, ఆ నక్షత్రాల కింద అతనిరక్తం తిరగబడి సౌందర్యాన్ని, శరీరాన్ని. ఆత్మని జయించి, విశ్వాన్నాక్రమించి, జన్మకు సమాధానమైంది.

"రిక్షా సాబ్"

............

ఆనందరావు సిగరెట్టు చైతాలోంచి ఉలిక్కిపడి చూశాడు.

"—ఏం తీసుకుంటావ్ ?"

"అరణా లివ్వండి"

వెధవకి తెగ ఆశ. ఆనందరావులో పంతం మరోవైపు విడవలేనంత పెరిగిపోతోంది. నుంచున్నవాడు ఎలాగూ ఇంతవరకూ నుంచున్నాడు. తనవైపే వాళ్లరావాలి, వాళ్ళవైపు తనుపోడు. వీళ్ళ విషయంలో జాలిపడకూడదు అనుకున్నాడు ఆనందరావు.

ఇంకో రిక్షా

మరోరిక్షా

"ఎక్కడి కెళ్లాలి ?"

చెప్పాడు.

"మూడణా లివ్వండి"

ఇదేమిటి ? వీడు కరెక్టుగా తను యివ్వదలచుకున్నంత అడిగేస్తున్నాడే. ఆనందరావు ఆశ్చర్యంగా రిక్షాలో కూలబడ్డాడు. అతనికెందుకో ఆలస్యం అయినప్పటికీ మనస్సు నిండా సంతృప్తి అలుముకుంది. ఈ రిక్షా

వాడు బాధలు తెలిసినవాడు, జీవితాన్ని పరిపూర్ణంగా చూసినవాడు అయి వుంటాడు. అందుకే తనకు రావలసినంత ప్రతిఫలాన్నే కోరాడు అనుకున్నా డతను. కాస్సేపట్లో అతని మనస్సులోని గొప్పవాళ్ల పటాలపక్కన రిక్షావాడుకూడా స్థానం ఏర్పరచుకున్నాడు.

రిక్షా కదిలింది. చక్రాలు వడివడిగా తిరిగిపోతున్నాయి సిమెంటురోడ్డుమీద.

ఆ రాత్రి అతని కళ్లముందు కదిలిపోయింది.

మర్నాడు ఆమె అతన్ని వాళ్ళింటికి టీ కి ఆహ్వానించింది.

అమె వీణ వాయించింది.

అతనికి జీవితం చిత్రంగా కనిపించింది. నువ్వు కావాలన్నప్పుడు ఏమీ యివ్వదు, అడుక్కు తినమంటుంది జీవితం; అక్కర్లేదన్నప్పుడు నిన్ను ఎట్లా సంతోషపెట్టాలా అనిచూస్తుంది.

అతను భయపడినంతా అయింది. రెండో రోజు కాలేజిగోడలమీద "మంజులత గాన కచేరి, కన్వీనర్ ఆనందరావు" అనే అక్షరాలు ఎర్రగా కనబడ్డాయి. అతను పడిన భయంలో ఆమె వెయ్యోవంతు పడలేదు. ఆ తరువాత రెండు వారాలవరకు వాళ్లు కలుసుకోలేక పోయినారు. ఓ రోజున కాలేజినుంచి వొచ్చి తలుపు తెరిచేప్పటికి గదిలో ఓకార్డు పడివుంది. మంజులత వ్రాసింది. తానీసారి పరీక్షలకు రావడంలేదు, ఎవరో స్నేహితురాలి పెళ్ళికి వెడుతోందట. ఉత్త అర్థంకాని మనిషి అనుకున్నాడతను అంతే. ఈ రెండు సంవత్సరాలలో ఆమె మళ్లీ కనిపించలేదు. ముకుందం కాబోలు ఆ మధ్య బెజవాడలో కనబడి అన్నాడు – ఆమె ఉద్యోగం చేస్తున్నదని.



"మీరు దెబ్బయి మైళ్ళ స్పీడులో వెడుతున్నారు, తెలుసా!"
''నిజమే. మొన్న మొన్న నేర్చుకున్నాను. అప్పుడే దెబ్బయి మైళ్ల వెళ్ళ గలుగుతున్నా నా! థాంక్ యూ! పోలీస్ మన్"

రిక్షా చక్రాలు చూస్తున్న ఆనందరావుకు కాలచక్రం రేకులాపడి నలిగిపోయిన అతని ఆశలు, ఆశయాలు కనబడ్డాయి. ఆమె తన్ని ప్రేమిస్తోంది. ఆ విషయం తన రక్తంకి తెలుసు. ఆమెను పెళ్ళి చేసుకోవాలి. ఇంత కాలం తన నిరీక్షణకి ఆమె సమాధానం. ఆమె తన హృదయంపై వీణ తంత్రుల్ని కదుపుతూ జీవితాన్ని సంగీతంతో నింపెయ్యాలి. ఓ సరస్సు పక్కన చిన్ని గుడిసె: తనకో చిన్న ఉద్యోగం; పూలమధ్య ఆమె, తను అంతే. అతని కింకేమీ అక్కరలేదు యీ ప్రపంచంలో. ఇంకేమీ ఒద్దు. అబ్బ ఎంచక్కని కల:

అతనింక కలలో వుండగానే వాళ్ళనాన్న వొచ్చి ఇంటికి తీసుకెళ్లాడు. తనకొచ్చిన ఉత్తరాలు ముందు పడేశాడు. వాటినిండా ఆనందరావు చెడిపోతున్నాడని, చదవడం లేదని, పరిస్థితి విషమించకముందే అదుపులో పెట్టుకోమనీ ఉంది. అమ్మ నూతివైపు పరు గెత్తింది. నాన్న ఉరిపోసుకుంటా నన్నాడు. ఫలితం మేనమామకూతురు అతని జీవితపు కళ్లెం తనచేతిలోకి తీసుకుంది. ఆనందరావు తనకు పెళ్ళి అవుతున్నట్లు ఎవరికీ తెలియ బరచలేదు. అతను కాలేజీ రోజుల్లో వేసు కున్న జీవితం బొమ్మ అలమారాలోని పాత కాగితాలో అడుగున పడిపోయింది.

మళ్ళీ ఇన్నాళ్లకి యీ ఉత్తరం—

—నేను నవంబరు 15 న వెడుతున్నాను.

నన్ను కలవడానికైనా రావచ్చునుగా—

అని మంజులత.

ఆఫీసుపని వంకతో నిన్ననే వొచ్చాడు. ముకుందుడి ఇంటిలో మకాం. ఆఫీసుపని, మిత్రుల కులాసాకబుర్లు అయేప్పటికి సాయం త్రం అయిపోయింది. ఈ రాత్రి తప్పక వెళ్లి పోవాలి. స్టేషనులో టికెట్ తీసుకుని ముకుందం ఎదురుచూస్తూంటాడు. ఇప్పుడే వస్తానని తనిటు బయల్దేరాడు. ఇంక కొన్ని నిము షాల్లో అత నామెను కలుస్తాడు. మళ్ళీ పాత గాయాలు రేగుతాయా? ఏమిటీ అన్వేషణ, నిరీక్షణ ఒకదానినుండి మరోదానికోసం? ఆమె ఏడుస్తుందా? కౌగిలించు కుంటుందా? యీ రాత్రికి వుండిపొమ్మంటుందా?....

సిగరెట్టు వేలిని కాల్చి మళ్ళీ వాస్తవికపు సిమెంటు రోడ్డుపై పడేసిందతన్ని.

పైన మేఘాలు కమ్ముకుంటున్నాయి.

రిక్షా వేగంగా పోతోంది. రిక్షావాడిమీద ఆనందరావుకు మరోసారి సానుభూతి పెల్లుబి కింది. ఏమిటి వాళ్ళ జీవితాలకర్థం? బురదలో కొట్టుకుంటున్న పురుగులా? అతను రిక్షా వాడికి అడక్కపోయినా పావలా యివ్వాలను కున్నాడు. వాడు సంతోషంగా మెరిసే కళ్ళతో ఆ పావలాను జేబులో వేసుకొని వెళ్ళడం అత నూహించుకున్నాడు.

అదిగో అదే సెంటర్. అక్కడనుండి మలుపు. వందగజాల తర్వాత ఓ మేడ. ఆ మేడమీద మొదటిగదిలో ఆమె.


రిక్షా సడెన్ బ్రేకుతో సెంటర్‌లో ఆగి పోయింది. అతను సందు చూపించి లోపలికి వెళ్లమని రిక్షావాడికి సంజ్ఞచేశాడు. వాడు చచ్చినా యింక ఒక్కఅడుగు ముందుకు వేయనని డబ్బులు యిచ్చి దిగమని అరిచాడు.

ఆనందరావులో రక్తం ఉడుకెత్తింది! ఈ వెధవగురించా తనింతవరకూ జాలిపడింది? బూటుతో రెండు వాయిద్దామనుకున్నాడు. కాని వాడుతాగి వున్నాడు. ఏమైనా చేయగలడు. అరుస్తాడు. జనంమూగుతారు. గొడవ.... అతని కివన్నీ ఒక్కసారి గుర్తువచ్చాయి. వా డింకా ఏదో గట్టిగా అంటున్నాడు. ఆనందరావు చర్రున దిగి, వాడికివ్వవలసిన మూడణాలు యిచ్చేసి సందులోకి నడిచాడు. రిక్షావాడు గట్టిగా స్వగతంలా గొణుక్కుం టున్నాడు తక్కువ యిచ్చాడని.

ఆనందరావులో ఆ క్షణం ఏదో చచ్చిపోయి నట్లయింది.

అంచనాలు భారంగా తలకిందులైనై. ఉత్సాహం ఎండిపోయింది. ఇంక జన్మలో రిక్షా ఎక్కకూడదని మనసులో ఒట్టు వేసు కున్నాడు.

ఒకటి, రెండు, మూడు గజాలు.... ఇంకా



రంగుల మామయ్య

ఆ మేడ. తనకు పరిచితమైన మేడ ఒచ్చేసింది. మేడమీదిలైటు కిటికీలోంచి కనబడుతోంది.

మెల్లెక్కి పైకెళ్ళాడు.

అతనికి జ్వరం వొచ్చినంత పనైంది.

పెద్ద కప్పతాళం అతన్ని చూసి పళ్ళికిలించి నవ్వింది చీకట్లో.

ఆనందరావుకి పై మెట్టుమీంచి దొర్లి కిందుపడి పోయినట్లయింది. బూటుచప్పుడికి పక్కభాగంలోంచి ఓ ముసలామె బయటికొచ్చి ...."ఎవరు కావాలిబాబూ?" అని అడిగింది. ఆనందరావు అంత చలిలోను పట్టిన చమటను తుడుచుకుంటూ చెప్పాడు.

"ఇంతకుముందే హాస్పిటల్‌కు వెళ్ళారు బాబూ. ఆవేం నొప్పులో నాయనా, రెండో కాన్పు అయినా పిల్లమెలికలు తిరిగిపోయింది. ఉండుబాబూ మంచితీర్థం తీసుకొస్తాను" అంటూ ఆమె లోపలికెళ్ళింది.

ఆనందరావు మరుక్షణం రోడ్డు మీద పడ్డాడు. వాచీ చూసుకున్నాడు. గడియారాల చరిత్రలో మొదటిసారి స్టేషన్‌లో గడియారం అతని వాచీ ఒకేచోట కలుసుకున్నయ్.

బండి బయలుదేరడానికి యింకా పది నిముషాలుంది.

ఎక్కడో మేఘం ఉలిక్కిపడింది.

నగరం రాత్రిలో తలదాచుకుంది.

నెమ్మదిగా సన్నని తుంపర ప్రారంభమైంది. నాలుగురోడ్ల సెంటరులో ఆనందరావు రిక్షా కోసం నుంచున్నాడు. అది దొరికితే అతనికి రైలు అందుతుంది.

.... .... ....

అ నాలుగురోడ్ల సెంటరులో ఆనందరావు ఆత్మలో సిలువను మోస్తూ నుంచున్నాడు. ★